అమ్మ వేడుక ఆరంభం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం




దేవీచౌక్‌లో ప్రత్యేక మండపంలో కొలువుదీరిన అమ్మవారు ● దర్శించుకుంటున్న భక్తులు

జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు గోదావరి తీరంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవీచౌక్ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయం వద్ద నవరాత్రి వేడుకల శోభ వెల్లివిరిసింది. ప్రధాన ఆలయానికి సమీపంలో ప్రత్యేక వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని నెలకొల్పారు. గురువారం ఉదయం 8.40 గంటలకు ఉత్సవ కమిటీ సభ్యులు కలశస్థాపన పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారిని స్వర్ణకవచ దుర్గాదేవిగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

గుత్తేదారు బెట్టు.. లోగుట్టు

- నీటి పథకాల నిర్వహణకు టెండర్లు వేసి ఒప్పందాలు చేసుకోని వైనం
- ఆరు నెలలుగా పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గ్రామీణ నీటి సరఫరా పథకం(ఆర్‌డబ్ల్యూఎస్)లోని ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి విచిత్రమైన పరిస్థితి నడుస్తోంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు ఒప్పందాలకు మాత్రం ముందుకు రావడం లేదు. తమకు లబ్ధి కలిగే విధంగా పైరవీలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తాగునీటి ప్రాజెక్టుల వద్ద నీటి శుద్ధి, మోటార్ల నిర్వహణ, ప్రధాన పైపులైన్ల మరమ్మతులు, కార్మికులకు జీతాల చెల్లింపులు వంటి వాటికి ఏటా గుత్తేదారులను ఖరారు చేస్తుంటారు. మార్చితో ఒప్పంద గడువు ముగిసింది. ఎన్నికల కోడ్‌తో పాతవారినే కొనసాగించారు. జూన్‌లో కోడ్ ముగిసింది. 2024-25 సంవత్సరంలో మిగిలిన కాలానికి పథకాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం చేశారు.



ముమ్మిడివరంలో రక్షిత తాగునీటి ● ప్రాజెక్టు

అందుకోసమేనా..

రూ.40 లక్షల కంటే ఎక్కువ నిర్వహణ వ్యయం ఉన్న పథకాలకు ఆగస్టులో టెండర్లు ఖరారు చేశారు. చాలామంది పాత గుత్తేదారులు 29 శాతం కంటే తక్కువకు వేసి పనులు దక్కించుకున్నారు. ఒప్పంద పత్రాలు రాసుకుని ఆ మేరకు నిర్వహణ, బిల్లుల చెల్లింపు ప్రక్రియ చేపట్టాలి. పాత ఒప్పందాల ప్రకారం చూసుకుంటే బిల్లుల చెల్లింపుల్లో మేలు జరుగుతుండటంతో కొత్త ప్రక్రియకు తాత్సారం చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది.

వాటికి ఎప్పుడు మరి..

రూ.40 లక్షల కంటే తక్కువ వ్యయంతో నిర్వహించే పథకాలకు ఈఈ స్థాయిలో టెండర్లు పిలిచినా ఇంకా తెరవలేదు. ఈ ప్రాజెక్టుల్లోనూ ఇంకా పాత గుత్తేదారులే కొనసాగుతున్నారు. కార్మికులకు పీఎఫ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని నిబంధనలు ఉన్నాయి. గుత్తేదారులు ఒప్పందాలకు ముందుకు రాకపోవడానికి ఇది కూడా ఓ కారణమని తెలుస్తోంది.

మచ్చుకు చూస్తే..

2023–24లో ముమ్మిడివరంలోని సమగ్ర రక్షిత తాగునీటి పథకం నిర్వహణకు టెండరు పిలిచారు. ఎస్ఎస్ఆర్ రేట్లకు 0.09 శాతం తక్కువకు గుత్తేదారు దక్కించుకున్నారు. ఇదే ప్రాజెక్టు నిర్వహణకు 2024-25కు సంబంధించి 29.27 శాతం తక్కువకు టెండరు వేసి దక్కించుకున్నారు. పాత టెండరు ప్రకారం నిర్వహణకు రూ.లక్ష చెల్లిస్తే.. కొత్తదాని ప్రకారం రూ.71 వేలు చెల్లించాలి.

సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు: 64

గత ఏడాది నిర్వహణ వ్యయం	నిర్వహణ రూ.40 లక్షల కంటే ఎక్కువ ఉన్నవి
రూ.35.19 కోట్లు	35

రూ.40 లక్షల కంటే తక్కువ ఉన్నవి 29

త్వరలో ఖరారు చేస్తాం..

నలభై లక్షల కంటే తక్కువ వ్యయంతో నిర్వహించే ప్రాజెక్టులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ జరుగుతోందని, ఈనెల 15 నాటికి ఖరారు చేస్తామని కోనసీమ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు. నిర్వహణ వ్యయం రూ.40 లక్షలకు పైబడిన వాటికి కాకినాడలోని ఎస్ఈ స్థాయిలో గుత్తేదారులు అగ్రిమెంట్లు రాయాల్సి ఉందన్నారు. ఇంకా ఒప్పందాలు జరగకపోవడంతో పాత టెండర్ల ప్రకారం చెల్లింపులు చేస్తున్నామన్నారు.

విదేశాలకు బియ్యం బళ్లు.. సిద్ధమేనా నిఘా కళ్లు

- తాజాగా పచ్చిబియ్యం ఎగుమతికి పచ్చజెండా
- రేషన్ సరకు తరలకుండా చర్యలు అవసరం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విదేశాలకు నౌకాశ్రయాల ద్వారా పచ్చిబియ్యం (రా రైస్) ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత కొన్నాళ్లుగా వీటిని నిలిపివేయగా ఇప్పుడు అనుమతిచ్చిన నేపథ్యంలో ఎగుమతులతో కాకినాడ పోర్టు కీలకంగా మారనుంది. ఇక్కడి నుంచి ఏటా లక్షల టన్నుల పచ్చిబియ్యం వెళ్తుంటాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి మాటున పోర్టును అడ్డాగా చేసుకొని పేదల బియ్యం(పీడీఎస్)ను తరలించారన్న ఆరోపణలున్నాయి. కాకినాడ వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, ఆయన కుటుంబం, కొందరు ఎగుమతిదారులు దీనివెనుక ఉన్నారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టు పరిసరాల్లోని గోదాముల్లో తనిఖీలు చేశారు. పీడీఎస్ ఆనవాళ్లు ఉన్న 25వేల టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రెండు చెక్‌పోస్టులూ ఏర్పాటుచేశారు. ఇప్పుడు పచ్చిబియ్యం ఎగుమతుల ముసుగులో రేషన్ సరకు తరలించకుండా గట్టి చర్యలు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీల్లో డొల్లతనం..

పోర్టు పరిసరాల్లోని రెండు చెక్‌పోస్టుల వద్ద ఒక్కో టెక్నికల్ అసిస్టెంట్, వీఆర్వో ఉన్నారు. ఉప తహసీల్దారు, ఆర్ఐ..ఆపై ఆర్డీవో, డీఎస్‌వో, డీఎం, కాకినాడ తహసీల్దార్ పర్యవేక్షణ ఉంటుంది.. గత రెండు నెలల్లో బియ్యం లోడుతో వెళ్తున్న 26,559 వాహనాలు.. 39 గూడ్స్ రైళ్లకు చెందిన 1,198 వ్యాగన్ల సరకు పరిశీలించారు. బియ్యం నాణ్యత తనిఖీలు సక్రమంగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. పోర్టు నుంచి ఉప్పుడు బియ్యం, నూకలు ఎగుమతి అవుతున్నాయి. కొందరు రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చగా 12.50టన్నులు పట్టుకొని కేసులు పెట్టారు.



కాకినాడ పోర్టు సమీపంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మూలుగుతున్న అక్రమ నిల్వలు

బాస్మతేతర బియ్యం ఎగుమతులపై కేంద్ర నిషేధం నేపథ్యంలో కొన్ని నెలలుగా కొందరు పెద్ద ఎత్తున అక్రమ నిల్వలు చేశారు. వీటిని ఇప్పుడు తరలించే అవకాశం ఉంది. పెద్ద ఎగుమతిదారుల్లో ఒకరిద్దరు కాకినాడలోనే ఉన్నారు.

ఏం చేయాలి

■ కాకినాడకు దూరంగా పోర్టు ప్రాంతంలో ఈ చెక్‌పోస్టులు ఉన్నందున పోలీసు భద్రత అవసరం. సిబ్బంది సంఖ్యనూ పెంచాలి ■ ఇతర ప్రాంతాల నుంచి కాకినాడకు వచ్చే బియ్యం లోడులను నిశితంగా తనిఖీ చేయాలి. ■ పోర్టు చెక్‌పోస్టులే గాక కాకినాడకు జాతీయ రహదారుల మీదుగా వచ్చే ప్రాంతాల్లోనూ రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాలు, విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు డేగకళ్లతో పరిశీలన చేయాలి.



కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి అయిన బియ్యం ■ లక్షల టన్నులు

మరింత అప్రమత్తం

చెక్‌పోస్టుల వద్ద నిఘాను ముమ్మరం చేస్తాం. అన్ని వాహనాలను తనిఖీ చేశాకే పోర్టులోకి అనుమతిస్తాం. గరిష్ఠంగా రోజుకు 1,199 వాహనాల్లో సరకు తరలించారు. కనిష్ఠంగా ఒక్క వాహనం వచ్చింది. తాజా పరిణామాలతో అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తాం. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ రాత్రిపూట వాహనాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం.

- ఎంవీ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ

నిల్వలున్నా.. ఇసుక అందదే

రవాణా సమస్యలు అధిగమిస్తేనే మేలు

ఈనాడు, రాజమహేంద్రవరం: ఇసుక నిల్వలు తగినన్ని ఉన్నా ప్రజల అవసరాలు తీర్చలేని పరిస్థితి నెలకొంది. గోదావరిలో డీసిల్టింగ్ విధానం కింద 9 ప్రాంతాల్లో ఇసుక తవ్వేందుకు 44 బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతించారు. రెండ్రోజులుగా కొన్ని రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ విధానంతో నిత్యం సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక బయటకు వస్తోంది. దీంతోపాటు నిడదవోలు మండల పరిధిలోని నిల్వ కేంద్రాల్లో సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. మరిన్ని సొసైటీలకు సైతం తవ్వకాలకు అనుమతించేందుకు కసరత్తు జరుగుతోంది.



గాయత్రి రీచ్‌లో ఇసుక తవ్వకాలు (పాతచిత్రం)

ఇవీ ఇబ్బందులు

ఇసుక విక్రయాలకు సంబంధించి ఆన్‌లైన్ విధానం అమలవుతోంది. బుక్ చేసినవారికి కేటాయింపు ప్రక్రియ రాష్ట్ర స్థాయిలో జరుగుతోందని.. దీని వల్ల స్థానికంగా ఉన్న వాహనాలను దూర ప్రాంతాలకు కేటాయిస్తుంటే వారు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో ఇసుక (బల్క్ బుకింగ్) కావాలనుకుంటే ఆన్‌లైన్ ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయని.. వాటిని అధిగమిస్తే ఇబ్బందులు ఉండవన్నారు.

నేడు 17 ప్రాంతాల్లో తవ్వకాలకు టెండర్లు?

తూర్పుగోదావరి జిల్లాలోని 17 ప్రాంతాల్లో ఓపెన్ రీచ్‌ల నిర్వహణకు (మాన్యువల్ విధానంలో) తవ్వకాలకు శుక్రవారం ఈ-టెండర్లు పిలవనున్నారు. సీతానగరంలో 3, పెరవలి-5, నిడదవోలు-3, కొవ్వూరు -4, తాళ్లపూడి-1, కడియంలో ఒక రీచ్‌లో అనుమతిస్తారు. వీటి ద్వారా సుమారు 7.90 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. మరో రెండ్రోజుల్లో ధవళేశ్వరం బ్యారేజీకి ఎగువన 8 ప్రాంతాల్లోనూ టెండర్లు పిలిచే యోచనలో అధికారులున్నట్లు తెలుస్తోంది.

నవ్వు.. నవ్వించు.. జీవించు

నవ్వటం ఒక భోగం.. నవ్వించటం ఒక యోగం.. నవ్వకపోవటం ఒక రోగం.. అన్నాడో సినీ కవి. నవ్వితే హ్యాపీ.. నవ్వకపోతే బీపీ.. అందుకే నవ్వండి.. ఇదీ ఈ తరం నిర్వచనం. మనలో ఎంతమంది రోజుకు కనీసం అయిదు నిమిషాలైనా మనస్ఫూర్తిగా నవ్వుకుంటున్నామని ప్రశ్నించుకుంటే.. ఉరుకుల పరుగుల జీవితంలో లేదనే చెప్పాలి. గ్లోబల్ హ్యాపీనెస్ ఇండెక్స్-24 నవ్వుల సూచిలో మన దేశం 126వ స్థానంలో ఉండడం పరిస్థితికి అద్దం పడుతోంది. నేడు నవ్వుల దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనమిది.



హాస్య స్కిట్‌ను ప్రదర్శిస్తూ...

జీవితంలోని రోజువారీ పనుల్లో వేగం, ఒత్తిడి, పోటీ, సమస్యలు.. ఇవన్నీ మనిషిని నవ్వుకు దూరం చేస్తున్నాయి. నవ్వడమే మర్చిపోయేలా చేస్తున్నాయి. అందుకే ఇప్పుడు నగరాలు, పట్టణాల్లో లాఫింగ్ క్లబ్‌లు ఏర్పడుతున్నాయి. చిరునవ్వులు మరిచిపోయిన వాళ్లకు నవ్వటం నేర్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరంలో ఎంవీ అప్పారావు, డీవీ హనుమంతరావు, ఖాదర్‌ఖాన్ డైరెక్టర్లుగా 2004లో హాసం క్లబ్ గోదావరి ఒడ్డున పురుడు పోసుకుంది. కరోనా ముందు వరకు ప్రతి నెలా మూడో ఆదివారం ఆనం కళాకేంద్రంలో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. ఈ క్లబ్ స్ఫూర్తితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 18 లాఫింగ్ క్లబ్‌లు ఏర్పడ్డాయి. ఈ క్లబ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంతోపాటు విశాఖ, విజయనగరం తదితర ప్రాంతాల్లో సైతం హాస్యభరితమైన కార్యక్రమాలను చేపట్టేవారమని సంఘ సభ్యులు హనుమంతరావు పేర్కొంటున్నారు. యువతరం ఈ బాధ్యత ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరుతున్నారు.

■ **యోగా అనంతరం నవ్వుకోవటమే..**

కాకినాడ నగరంలో యోగా అనంతరం ఓ అయిదు నిమిషాలపాటు నవ్వుకునే కార్యక్రమాలను నిత్యం చేపడుతున్నారు. రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఇప్పటికీ యోగా తరగతులు పూర్తయిన తర్వాత బిగ్గరగా అయిదు నిమిషాలపాటు నవ్వుకుని సరదాగా జోకులు వేసుకుంటారు. దీనివల్ల అప్పటివరకు చేసిన వ్యాయామాల ఒత్తిడి ఒక్కసారిగా హుష్‌కాకి అయిపోతుందంటారు అక్కడి సభ్యులు.

■ **ప్రయోజనాలెన్నో..**

☛ మనస్ఫూర్తిగా నవ్వే నవ్వు శారీరక, మానసిక రుగ్మతలను దూరంచేసి ప్రశాంతతను ఇవ్వటంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ☛ హాయిగా నవ్వటం వల్ల శరీరమంతా విశ్రాంతి పొందుతుంది. ☛ రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. రక్త ప్రవాహాన్ని సక్రమంగా ఉంచుతుంది. దీని వల్ల గుండెపోటు, ఇతర హృదయ సంబంధిత వ్యాధులు తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ☛ నవ్వుతూ మాట్లాడేవారి పట్ల ఇతరులు ఆకర్షితులవుతారు. రోగులు వేగంగా కోలుకోవటంలో డాక్టరు నవ్వే నవ్వు కొండంత బలాన్నిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

■ **నవ్వుతో మనసు, మనిషిని జయించవచ్చు**

భావితరం టెక్నాలజీ కారణంగా నవ్వు, ఆనందాన్ని కోల్పోతున్నారు. ప్రతి మనిషిలోనూ ఒక హాస్యనటుడుంటాడు. ఆస్వాదిస్తే జీవితం నవ్వుల భరితంగా మారుతుంది. నవ్వుతో మనలోని మనసు, మనిషిని జయించవచ్చు.

- పరస రవి, కన్వీనర్, హాసం క్లబ్

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం)



సిబ్బందికి సూచనలిస్తున్న పీసీఎండీ వెంకటేశ్వర్లు

రైల్వేస్టేషన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై అసంతృప్తి

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్(పీసీఎండీ) వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఆయన ఇక్కడికి వచ్చారు. తొలుత రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికుల నిరీక్షణ మందిరాలు, మరుగుదొడ్ల నిర్వహణ తీరును పరిశీలించారు. మరుగుదొడ్లు, వెయిటింగ్ హాళ్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం, ప్లాట్‌ఫామ్‌లపై చెత్త ఉండటంతో సంబంధిత పారిశుద్ధ్య నిర్వహణ గుత్తేదారుడిని ప్రశ్నించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో డీసీఎండీ పాల్గొని సిబ్బందితో కలిసి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఆయన వెంట చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(సీఎంఎస్) శౌరబాల, స్టేషన్ మేనేజర్ శ్రీరంగనాథ్, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, రైల్వే అడ్వైజరీ బోర్డు సభ్యులు ఉన్నారు.

పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలపై దిశానిర్దేశం

రాజమహేంద్రవరం కలెక్టరేట్: పట్టా భూములు, డీకేటీ భూముల నుంచి ఇసుకను డి-కాస్టింగ్‌కు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఇసుక తవ్వకాల ధర నిర్ణయంపై ఇతర జిల్లాల్లో వివరాలను విశ్లేషించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ(డీఎల్ఎస్‌సీ) సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టా భూముల నుంచి ఇసుక తొలగించడానికి వివరణాత్మక మార్గదర్శకాలతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దానికనుగుణంగా అనుబంధ కార్యకలాపాలు చేపట్టాల్సి ఉందన్నారు. పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్ పుస్తకం, గ్రామ మ్యాప్‌లో ఉన్న భూమి నకళ్లతో కలెక్టరేట్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. ఇసుక కమిటీ క్షేత్రస్థాయిలో పట్టాభూమి సంయుక్త తనిఖీ చేపట్టాలని, దానికి భూగర్భ జలవనరులు, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, గనుల శాఖ అధికారులతోపాటు సంబంధిత డివిజన్ పరిధి ఆర్డీవో, డీఎస్పీలు హాజరవ్వాలన్నారు. సమన్వయ శాఖల అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలను వివరించారు. నీటి పారుదల శాఖ క్షుణ్ణంగా పరిశీలించి పట్టా భూముల డి-కాస్టింగ్‌కు క్లియరెన్స్ జారీ చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, ఆర్డీవోలు కృష్ణనాయక్, రాణిసుస్మిత, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్లు కొనిపించిన ఎస్సై

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, లేని పక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ హెచ్చరించారు. అనపర్తిలో గురువారం సాయంత్రం హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న కొందరికి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని వాహన చోదకులతో వాటిని కొనిపించారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనునాయక్

■ **కొత్తగా 12 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన**

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: జిల్లాలో ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాల్సిన నేపథ్యంలో జిల్లాలో కొత్తగా 12 ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 9, గ్రామీణంలో 3 ప్రతిపాదించామన్నారు. దీంతో జిల్లాలో మొత్తం 1,581 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. పోలింగ్ కేంద్రాల పేరు మార్పునకు 48 కేంద్రాలు, పీఎస్ స్థానాన్ని మార్చేందుకు అయిదు కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

■ **469 మంది చిన్నారులకు 'బంగారు కొండ'**

టి.నగర్, న్యూస్‌టుడే: చిన్నారుల్లో అనారోగ్య సమస్యలను గుర్తించి, నివారణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గెయిల్ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వయసుకు తగ్గ బరువు, ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపం గల పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకు రావడానికి బంగారు కొండ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థంగా చేపట్టాల్సి ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బంగారు కొండ ప్లస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 469 మంది చిన్నారులు ఈ విభాగంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహార లోపం నిర్మూలన, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. స్త్రీ శిశు సంక్షేమ అధికారి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె వనం.. పచ్చదనం

24 చోట్ల అభివృద్ధికి అడుగులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

గ్రామీణ ప్రాంతాల్లో అటవీ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి అకిరా మియావాకీ పద్ధతిలో దట్టంగా మొక్కలు పెంచనున్నారు. పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుతో పాటు ఉపాధి కూలీలకు అధిక పనిదినాలు కల్పించే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగనుంది.

గ్రామీణ అడవులు సృష్టించి పర్యావరణ వ్యవస్థ మెరుగుపరిచేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్‌జీఎస్)లో అల్ట్రా హైడెన్సిటీ(యూహెచ్‌డీ) ప్లాంటేషన్‌ను ప్రోత్సహించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ మేరకు పల్లె వనాల కోసం జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, కమ్యూనిటీ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ప్రశాంతి ఇటీవల క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించడంతో పనులు పట్టాలెక్కాయి.



కలెక్టరేట్ ఆవరణలో నాటుతున్న మొక్కలు

ప్రతిచోటా 2,700 మొక్కలకు ఊపిరి

జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో ఇప్పటివరకు 24 చోట్ల 25 సెంట్ల చొప్పున ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటేందుకు ఎంపిక చేశారు. ఒక్కో స్థలంలో 2,700 చొప్పున దట్టంగా మొక్కలు నాటి పల్లె వనాలు పెంచి పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచనున్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఖాళీస్థలంలో అకిరా మియావాకీ విధానంలో దట్టంగా మొక్కలు పెంచే కార్యక్రమానికి ఇటీవల శ్రీకారం చుట్టారు. జిల్లాలోని కడియం, బిక్కవోలు, కోరుకొండ, గోకవరం, సీతానగరం, రాజానగరం, అనపర్తి, చాగల్లు, పెరవలి, గోపాలపురం, తాళ్లపూడి, నిడదవోలు, దేవరపల్లి, ఉండ్రాజవరం, నల్లజర్ల మండలాల్లో గుర్తించిన ఖాళీ స్థలాల్లో మొక్కలునాటి పల్లెవనాలు ఏర్పాటు చేయనున్నారు.


25 రకాల జాతులతో..

పర్యావరణ ప్రయోజనాలు పొందడానికి వీలుగా పల్లెవనాలు పెంచేందుకు వేప, ఉసిరి, రావి, చింత, సీతాఫలం, తెల్లమద్ది, గానుగ ఇలా 25 రకాల జాతుల మొక్కలను నాటేందుకు ప్రతిపాదించారు. వీటిలో ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మొక్కలను అక్కడ గుర్తించిన ఖాళీ స్థలాల్లో నాటతారు. జిల్లాలో గుర్తించిన 24 ఖాళీ స్థలాల్లో నాటేందుకు మొత్తం 64,800 మొక్కలు అవసరమవుతాయి. వీటిని అటవీ నర్సరీలు, రిజిస్ట్రార్ అయిన ప్రైవేటు నర్సరీల నుంచి సేకరిస్తున్నారు. ఆయా ఖాళీస్థలాల్లో దట్టంగా నాటిన మొక్కలు పెరిగి వనంలా తయారయ్యేవరకు నిర్వహణ, మొక్కల సంరక్షణ ఉపాధి పథకం ద్వారానే చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సకల శక్తి స్వరూపిణి.. సర్వ జగద్రక్షిణి..


రాజమహేంద్రవరం: మార్కండేయ స్వామి ఆలయంలో అమ్మవారు


మోరంపూడి సాయినగర్‌లో..


శ్రీబాలగా ఉత్సవమూర్తి వైభవం

అమ్మలగన్నయమ్మ పూజా వేడుకలు అట్టహాసంగా మొదలయ్యాయి.. ముగ్గురమ్మల మూలపుటమ్మ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ దసరా శరన్నవరాత్రుల్లో నవదుర్గల అలంకారంలో రోజుకో రూపంతో ఆ పరాశక్తి దర్శనమివ్వనుంది.. అందులో భాగంగా తొలిరోజైన గురువారం ఊరికో అలంకారంతో కనువిందు చేసింది.. నవరాత్రుల దీక్షధారుల జయధ్వానాల నడుమ విశేష పూజ లందుకుంది.. తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని ప్రముఖ ఆలయాల్లో ఆ శక్తి స్వరూపిణి కనువిందు చేసే చిత్రాలివి..

- న్యూస్‌టుడే, తూర్పుగోదావరి బృందం


సీతంపేట రామాలయంలో మహాలక్ష్మీ దేవి


కడియపులంకలో శ్రీదుర్గాదేవిగా అపర్ణాదేవి


నిడదవోలు: కోట సత్తెమ్మకు ప్రత్యేకాలంకరణ

అన్నవరంలో రామబాణానికి పూజలు


పూజలు చేస్తున్న వైదిక బృందం

అన్నవరం, న్యూస్‌టుడే: శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసానికి గుర్తుగా బంగారం, వెండితో అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ తయారుచేయించిన రామబాణానికి అన్నవరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామమందిరానికి అందజేసేందుకు ఒక కిలో బంగారం, 13 కిలోల వెండితో మొత్తంగా 14 కిలోగ్రాముల బాణాన్ని చేయించారు. రామభక్తుల దర్శనానికి బాణాన్ని అన్ని పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తున్నారు. ఫౌండేషన్ స్థాపకులు చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో అన్నవరం తెచ్చారు. ముందుగా అర్చకులు పూజలు చేసి సత్యదేవుని ప్రధానాలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల అనంతరం క్షేత్ర పాలకులు సీతారాముల వారి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు రామబాణాన్ని దర్శించుకున్నారు.

డ్వామా పీడీగా నాగేశ్వరరావు


పీడీకి స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

ధవళేశ్వరం: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరుగా ఎ.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కృష్ణాజిల్లా డ్వామా పీడీ కార్యాలయంలో ఏపీగా ఆయన పనిచేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో జిల్లాకు వచ్చారు. అనంతరం జిల్లా కలెక్టరు ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెట్టకు 700 క్యూసెక్కుల సాగునీరు

సీతానగరం: గోదావరి ఎడమగట్టున సీతానగరం మండలంలోని పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల ద్వారా తూర్పు, కాకినాడ జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల కోసం గురువారం నీటిని విడుదల చేశారు. 18 మండలాల్లో సాగునీటి అవసరాలకు గాను 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. ఏలేరు జలాశయంలో అదనపు నిల్వలు ఉండటం వల్ల పోలవరం ఎడమ ప్రధానకాలువ నుంచి సాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశామన్నారు. గోదావరి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరుతోందన్నారు.

కడియం మొక్కలకు మట్టి కష్టాలు..!

● అమాంతం పెరిగిన ఎర్ర మృత్తిక ధర ● రైతుల ఆందోళన: ప్రభుత్వానికి వినతి

న్యూస్‌టుడే, కడియం

కడియం.. ఈ పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకొచ్చేది మొక్కలు.. అందమైన ఉద్యానాలతో ఆహ్లాదకరంగా కనిపించే ప్రాంతం.. ఇక్కడి మొక్కలు యావత్ దేశవ్యాప్తంగా విక్రయాలు జరుగుతుండగా, విదేశాల్లోని విభిన్న జాతుల మొక్కలు సైతం కడియంలో కనువిందు చేస్తుంటాయి. అంతలా ఖ్యాతి గడించిన ఈ ప్రాంత నర్సరీ రైతులను ఇప్పుడు మట్టి కష్టాలు వెంటాడుతున్నాయి. మొక్కల పెంపకంలో ప్రధాన భూమిక పోషించే ఎర్ర మృత్తిక ధరలు ఆకాశాన్నంటుతుండటంతో అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వంలో అమాంతం పెరిగిపోవడం సాగుదారులను కుంగదీస్తోంది.


కడియపులంకలో ఓ నర్సరీ వద్ద ఎర్రమట్టి నిల్వలు

అప్పట్లో నయం.. ఇప్పుడు భయం..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ మట్టి ధర ఒక లారీకి రూ.7,500 ఉండేది. అనంతరం వచ్చిన వైకాపా హయాంలో రూ.8,500 నుంచి ఏటా వెయ్యి పెంచుతూ రూ.10వేలకు చేరింది. ప్రస్తుతం ఆ ధర ఒకేసారి రూ.4వేలు పెరగడంతో రూ.14,500 పలుకుతోంది. దీంతో నర్సరీ సాగులో రైతులకు ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఈ మట్టిని పంగిడి, సూరంపాలెం, జగ్గంపేట ప్రాంతాల నుంచి రైతులు కొనుగోలు చేస్తుండగా.. మైనింగ్ సెస్, టోల్ ఛార్జీల పెరుగుదల కారణాన్ని మట్టి విక్రయదారులు చెబుతున్నట్లు రైతులు స్పష్టం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఎకరం విస్తీర్ణంలో మొక్కల సాగుకు ఏడాదికి దాదాపు 10 నుంచి 20 లారీల ఎర్రమట్టి అవసరం అవుతుందన్నది రైతుల మాట. లారీకి రూ.14,500 చొప్పున 20 లారీలకు ఈ ధర రూ.2.9 లక్షల మేర ఉంటుంది. ఇది మునుపటి ధరల కంటే రూ.80వేలు అధిక భారంగా ఉంది. ఎకరా రైతుకే ఇంత భారమైతే పదుల సంఖ్యలో ఈ సాగు


సీఎం చంద్రబాబుకు నర్సరీ రైతుల సమస్యను వివరిస్తున్న సంఘ సభ్యులు (పాత చిత్రం)

చేసే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సమస్యను పరిష్కరించాలంటూ సీఎం చంద్రబాబుతో పాటు.. రెవెన్యూ మంత్రిని సైతం కలిసి అభ్యర్థించారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం

నర్సరీ రైతాంగం పెరిగిన ఎర్రమట్టి ధరలతో కుదేలైంది. రవాణా, టోల్‌గేటు, ఇతరత్రా సెస్సులతో నర్సరీ రైతుపై ఈ ధరలు పిడుగుపాటుగా మారాయి. ఒక్కసారిగా ఇంతటి ధర పెంపు సక్రమం కాదని ఇటీవల సీఎం చంద్రబాబుతో సహా మంత్రులను కలిసి విన్నవించాం. ఇప్పటికైనా స్పందించి ధరలను నియంత్రించాలి.

- మార్గాని సత్యనారాయణ, ఐఎన్‌ఏ గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు, కడియపులంక

కోస్తా రైలు మార్గానికి వినతి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కోస్తా రైలు మార్గం నిర్మాణం చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా, కోకనాడ టౌన్ ప్రయాణికుల సంఘం, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు వైడీ రామారావు రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రైల్వే సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో విజయవాడలో శుక్రవారం బోర్డు సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో వైడీ రామారావు గురువారం మాట్లాడారు. కోస్తా తీరంలో వ్యవసాయ, పారిశ్రామిక, నౌక వాణిజ్యం, గ్యాస్, పెట్రోలియం, సముద్ర, జల ఉత్పత్తుల కేంద్రంగా ఉన్న గోదావరి కృష్ణా పరివాహక ప్రాంతాన్ని కలుపుతూ కోస్తా రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. పోర్టు అభివృద్ధితో పాటు వ్యవసాయ, వాణిజ పంటల రవాణా సులభతరం అవుతుందన్నారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు.

నడుము, మోకాళ్ల నొప్పులకు ప్రత్యేక విభాగం


జీజీహెచ్‌లో క్లినిక్ ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోని ఎముకల వైద్య విభాగంలో 24గంటల ఆపరేషన్ థియేటర్ ప్రారంభించి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా నడుము, మోకాళ్ల నొప్పులు, పుట్టుకతో వచ్చే పాదాల వంకర్లకు ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి గురువారం దీన్ని ప్రారంభించారు. డీఎంఈ డా.నరసింహం సూచనల మేరకు ఆయా విభాగాల్లోని నిపుణులతో వైద్యం అందిస్తామని ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డా.పాండురంగ విఠల్ తెలిపారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, డా.పార్థసారధి, డా.ముఖర్జీ, డా.వింధ్య, డా.ప్రసన్న, డా.రామ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి ఎన్.శివ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఎంపికైన సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిడదవోలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయిఅథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు నిడదవోలు మండలం తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సూర్యనారాయణమూర్తి, వ్యాయామోపాధ్యాయుడు బండి ప్రదీప్ గురువారం తెలిపారు. పరుగు పందెంలో బి.చంద్రశేఖర్, ఎన్.అనిల్, ఎన్.శామ్యూల్‌రాజు, షాట్‌పుట్‌లో సీహెచ్ ఆకాష్, హైజంప్‌లో పి.మురళి పాల్గొంటారన్నారు.

● రాష్ట్రస్థాయి పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీల్లో అండర్-14 విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు కోమలి వెంకన్నబాబు, దేవర వెంకట రమణ పాల్గొంటున్నట్లు పురుషోత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌వీఎస్ ప్రసాద్, వ్యాయామోపాధ్యాయుడు ఎన్.తారక రామారావు తెలిపారు.

జాతీయ భావన పెంపునకు ఎన్‌సీసీ దోహదం

ఎంపీ పురందేశ్వరి

రాజానగరం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వారిలో జాతీయ భావన పెంపొందింపజేసేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతో దోహదపడుతుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఎన్‌సీసీ వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయ పాలన, దేశభక్తి కలుగుతాయన్నారు. భారతదేశ విలువలను భావితరాలకు తెలిపేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతదేశాన్ని అన్ని దేశాలు గుర్తిస్తున్నాయని.. సామాజిక విభజన తీసుకువచ్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. వాటిని శక్తిమంతంగా ఎదుర్కొనేందుకు, జాతీయ సమైక్యతా భావన పిల్లల్లో బలంగా నాటేందుకు ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సమయంలోనూ ఎన్‌సీసీ వాలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గార్డ్ ఆఫ్ ఆనర్ స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), పలువురు ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ


ఎన్‌సీసీ కేడెట్లతో ఎంపీ పురందరేశ్వరి, చైతన్యరాజు

● వెబ్‌సైట్ ప్రారంభం: జీజీయూ కొత్త వెబ్‌సైట్‌ను అధికారికంగా ఎంపీ ప్రారంభించారు. విద్యార్థులకు డిజిటల్ యాక్సెస్‌ను మెరుగుపరచడానికి ఈ వెబ్‌సైట్ కీలకంగా నిలుస్తుందన్నారు. యువ ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలకు నాంది పలికి సాంకేతిక అభివృద్ధి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని పిలుపునిచ్చారు. జీజీయూ ఛాన్సలర్ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్యరాజు) నూతనంగా ఆవిష్కరించిన జీజీయూ వెబ్‌సైట్ విద్యార్థులకు అందించే ప్రయోజనాలను వివరించారు. ఉపకులపతి డా.వి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా.పి.ఎం.ఎం.ఎస్.శర్మ, డైరెక్టర్ డా.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులపై వైద్యసిబ్బంది నిర్లక్ష్యం

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొంతమంది వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్ల పేదలకు సేవలు సరిగా అందడం లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాలింతలను గురువారం ఆయన పరామర్శించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రసవించేందుకు సిద్ధమైన ఇద్దరు గర్భిణులకు ప్రాణపాయ పరిస్థితి ఏర్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రసవ సమయం దగ్గర పడడంతో అనపర్తికి చెందిన ఓ మహిళ సోమవారం ఉదయం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేరింది. ఆమెను వైద్యులు పరీక్షించి ప్రసవం అయ్యేందుకు కొన్ని మందులు రాశారు. అదే రోజు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆమెకు నొప్పులు రావడం మొదలయ్యాకా


డీసీహెచ్‌ఎస్‌తో చరవాణిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిడ్డ పరిస్థితి బాలేదని.. రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్లాలంటూ వైద్యసిబ్బంది వారికి సూచించారు. అప్పటికే ఆమెకు బిడ్డ కొంచెం బయటకు వచ్చి రక్తస్రావం అవుతున్నా సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో బంధువులు ఆమెను ఓ కారుపై అనపర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ గర్భిణికి నొప్పులు మొదలవగా.. ప్రసవం అవ్వదని, వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలంటూ బంధువులకు సూచించారు. దీంతో గత్యంతరంలేని పరిస్థితిలో గర్భిణీని ద్విచక్రవాహనంపై ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు తల్లులూ, వారి బిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బంధువులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రామగుర్రెడ్డిని పిలిపించి విషయంపై ఆరా తీశారు. నిర్లక్ష్యం వహించిన వైద్యసిబ్బందిపై మండిపడ్డారు. డీసీహెచ్‌ఎస్‌కు ఘటన వివరాలను చరవాణిలో వివరించారు. శుక్రవారం ఉదయం ఘటనకు సంబంధించి సమీక్ష చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఆనందం


హైదరాబాద్ - నెల్లూరు జిల్లా జట్ల మధ్య వాలీబాల్ పోటీ

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్.విజయప్రకాష్ అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ క్లస్టర్ - 7 (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు) వాలీబాల్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులందరూ క్రీడా ప్రతిజ్ఞ చేశారు. తొలుత జాతీయజెండాను విజయప్రకాష్, సీబీఎస్ఈ క్రీడా పతాకాన్ని క్రీడల పరిశీలకుడు కిషోర్‌కుమార్, పాఠశాల పతాకాన్ని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.యశ్వంత్ ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారుల వద్దకు వెళ్లి వారిని పరిచయం చేసుకున్నారు. రెండు రాష్ట్రాలలోని 95 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 1,400 మందికి పైగా క్రీడాకారులు, 150 మందికి పైగా కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. అండర్ - 14, 17, 19 మూడు విభాగాలుగా విద్యార్థులను విభజించి ఈ క్రీడలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల ఆరో తేదీ వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎం.వి.వి.ఎస్.మూర్తి, ఏ.ఎస్.ఎన్.మూర్తి, విమల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రూ.5 కోట్ల ఓఎన్జీసీ నిధులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో నాణ్యమైన తాగునీటి సరఫరాకు ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటు చేయడానికి ఓఎన్జీసీ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కార్యాలయంలో గురువారం ఎసెట్ మేనేజరు, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. గుడిమెళ్లంక, అంతర్వేదిపాలెం, తాటిపాక, ములికిపల్లి ప్రాంతాల్లోని రక్షిత పథకాల ద్వారా ప్రస్తుతం తాగునీరు సరఫరా అవుతోందని, ఇందులో నాణ్యత లేదన్నారు. ఈ నేపథ్యంలో నీటిశుద్ధి విభాగాలను ఆధునికీకరించాల్సిందిగా ఓఎన్జీసీ అధికారులను కోరానన్నారు. ఈ మేరకు వారు నిధుల మంజూరుకు అంగీకరించారని చెప్పారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	140-00
డ్రెస్డ్	203-00
స్కిన్‌లెస్	231-00

కోలాటం చూడ్డానికొస్తే కత్తిపోట్లు

● రోడ్డుపై ప్రదర్శన ఏర్పాటుపై ఘర్షణ ● నలుగురికి గాయాలు

నిడదవోలు, న్యూస్‌టుడే : కోలాటం ప్రదర్శన చూద్దామని వస్తే కత్తిపోట్లకు గురికావాల్సి వచ్చింది. ఈ ఘటన నిడదవోలు పట్టణంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దసరా వేడుకల్లో భాగంగా లింగంపల్లిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద గురువారం రాత్రి కోలాటం తోపాటు భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న గుంటు సునీల్ అనే యువకుడు రహదారిపై అడ్డంగా కార్యక్రమం ఏర్పాటు చేస్తే ఎలా అంటూ నిర్వాహకులను ప్రశ్నించాడు. పది నిమిషాల్లో అయిపోతుందని వారు చెబుతున్నా.. సునీల్ ద్విచక్ర వాహనాన్ని ముందుకు నడిపించడానికి ప్రయత్నించడంతో నిర్వాహకులు, అతనికి మధ్య మాటామాటా పెరిగింది. ఆ సమయంలో గుంటు అనిల్ అనే యువకుడు రెండు చాకులతో ఘర్షణకు దిగి ప్రదర్శన వీక్షించేందుకు వచ్చిన కాకర్ల శ్రీను, కాకర్ల పుట్టియ్య, కాకర్ల ప్రవీణ్, మీసాల శ్రీనును పొడిచారు. చికిత్స నిమిత్తం వారిని స్థానికులు నిడదవోలు సామాజిక ఆసుపత్రికి తరలించారు. వీరిలో కాకర్ల శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. సమాచారం అందుకున్న సీఐ వి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై శోభన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్షతగాత్రుల్లో శ్రీను, పుట్టియ్య, ప్రవీణ్ ఒకే కుటుంబానికి తండ్రి, తాతా, మనమళ్లు.


చికిత్స పొందుతున్న బాధితులు


తీవ్రంగా గాయపడిన శ్రీను

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

శ్యామలాసెంటర్, హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్(గణితం) ఎం.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలో ఓ విద్యార్థినితో అనుచితంగా ప్రవర్తించటంతో పాటు హోం వర్కు సరిగా చేయని మరో బాలుడిని శిక్షించినట్లు ఫిర్యాదులు అందగా దీనిపై డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ముగ్గురు అధికారులతో విచారణ కమిటీ వేశారు. కమిటీ నివేదిక ఆధారంగా వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు డీఎస్ఈఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలుడిని హోం వర్కు చేయలేదని మాత్రమే మందలించానని, విద్యార్థినిని తాను ఏమీ అనలేదని ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం

పలువురు సీఐలకు బదిలీ

దానవాయిపేట (రాజమహేంద్రవరం): జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ డి.నరసింహకిశోర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎండీ అబ్దుల్ నబిను నగరంలోని ట్రాఫిక్-1కు, జిల్లా డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.సూరిబాబును ట్రాఫిక్-2కి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న కె.మంగాదేవిని మహిళా పీఎస్‌కు, పి.వి.పవన్‌కుమార్ రెడ్డిని జిల్లా డీసీఆర్‌బీకి, బి.విజయ శంకర్‌ను సీసీఎస్-1కి, ఈ.బాలసౌర్యను సీసీఎస్-2కి, వై.రాంబాబును సీసీఎస్-3కి బదిలీలు చేశారు.

సినిమాలు

శ్యామల, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: **దేవర**, అనుశ్రీ: **స్వాగ్**, సూర్యమినీ: **దక్షిణ**, శివజ్యోతి: **రామ్‌నగర్ బన్నీ**, స్వామి: **జోకర్**, రంభ: **కలి**, ఊర్వశి: **సత్యం సుందరం**, మేనక: **మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ** (రెండు ఆటలు).

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్: పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

ప్రాంతాలు: స్పిన్నింగ్ మిల్లు కాలనీ, సైక్లోన్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, శంకర్ విలాస్ ప్రాంతం, ఫారెస్ట్ అకాడమీ, దూరదర్శన్, రామచంద్రరావు కాలనీ, బత్తినగర్, ఆల్వాల్‌నగర్, ఇండస్ట్రియల్ ప్రాంతం, స్వరూప్‌నగర్, సాయి దుర్గానగర్, నారాయణపురం, గాదిరెడ్డినగర్.

సమయం: ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

ప్రాంతాలు: జాంపేట, గణేష్‌చౌక్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, లక్ష్మీవారపుపేట, తుమ్మలావ, ఆర్యాపురం.

సమయం: ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ప్రాంతాలు: పుష్కర్‌ఘాట్, వాటర్‌వర్క్స్, గోదావరిగట్టు, రిలయన్స్ మార్ట్, టి.నగర్, మెయిన్ రోడ్డు, ఏనుగు గుమ్మాల వీధి, ఇన్నీసుపేట, స్టేడియం రోడ్డు, గారపాటినగర్.

పత్రాల కోసం పాట్లు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధి పొందేందుకు పరీక్షల కోసం వచ్చిన పలువురు రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రి వద్ద గురువారం నిరసన చేపట్టారు. వీల్‌ఛైర్లు అందుబాటులో లేవని, ధ్రువపత్రాల దరఖాస్తులు త్వరగా స్వీకరించట్లేదని ఆసుపత్రి ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఆర్‌ఎంఓ ప్రణవ్ వారితో మాట్లాడి సర్దిచెప్పి, పరిస్థితి చక్కదిద్దారు.



జీజీహెచ్ వద్ద బైఠాయించిన పింఛను లబ్ధిదారులు

వారాహి డిక్లరేషన్ ప్రత్యక్ష ప్రసారం

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దివ్య ఆశీస్సులతో గురువారం తిరుపతిలో 'వారాహి సభ' వేదికగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం 'వారాహి డిక్లరేషన్' ప్రకటించిన జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యక్ష ప్రసారం సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ నగర ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.



సుబ్రహ్మణ్య మైదానంలో వీక్షిస్తున్న నగరవాసులు

వేతన బకాయిల కోసం ఆందోళన

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని సత్యసాయి పథకంలో పనిచేస్తున్న తమకు 16 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం లాలాచెరువు భాస్కర్‌నగర్ వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు సందర్శించి మద్దతు తెలిపారు. మెట్ట, గిరిజన ప్రాంతాల్లోని ఆయా మండలాలకు తాగునీరు అందించే సత్యసాయి పథకంలో 18 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గుత్తేదారుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సరైన సమాధానం చెప్పడంలేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉన్నప్పటికీ ఆ ఖాతాల్లో డబ్బులు జమకావడంలేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.



సమ్మెలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టండి

టి.నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ కేసులపై దృష్టి సారించాలని ఆర్డీఓ నాయక్‌ను విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు కోరారు. నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన నాయక్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. భూముల అన్యాక్రాంతంపై ఉన్న ఫిర్యాదులను పరిశీలించాలని కోరారు.



డివిజన్‌వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

పుష్కరాల నాటికి తీర్చిదిద్దుతాం

టి.నగర్, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాల నాటికి నగరాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం 11వ డివిజన్‌లో పర్యటించి, స్థానిక సమస్యలు పరిశీలించారు. డివిజన్‌లో సీసీ రహదారి, కాలువలు, కల్వర్టులు నిర్మించాల్సి ఉందన్నారు. నగరంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. క్వారీ సెంటర్‌లో అదనంగా మరో ఏబీసీ సెంటరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

★ మహిళల భద్రత, రక్షణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు 4వ డివిజన్ రాజేంద్రనగర్‌లో టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. నగరంలో తొలిసారిగా మహిళ రక్షక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హమ్మయ్య.. రూ.40 లక్షల భారం తప్పింది!

చెత్త పన్ను రద్దుచేసిన కూటమి ప్రభుత్వం

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం చెత్త పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వైకాపా ప్రభుత్వం ప్రారంభించిన ఈ పన్ను విధానంపై అప్పట్లోనే ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ నిర్ణయంతో నగరవాసులపై రూ.40 లక్షలకు పైగా భారం తీరనుంది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థల పరిధి మురికివాడ ప్రాంతాల్లో నెలకు రూ.50, మిగిలిన చోట్ల రూ.90 చెత్త పన్ను రూపంలో నివాసితుల నుంచి వసూలు చేసేవారు. అప్పట్లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పేరుతో ఇంటింటా చెత్త సేకరణ నిర్వహించేందుకు వాహనాలను పెట్టి వాటికి నెలనెలా అద్దె చెల్లించాలని నిబంధనలు విధించారు. ఇలా నగరపాలక సంస్థకు 90కి పైగా వాహనాలు పంపిణీ చేశారు.



ఇంటింటా చెత్త సేకరణ (పాత చిత్రం)

ప్రభుత్వమే భరించేలా..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఎన్నికల వాగ్దానంలో భాగంగా చెత్త పన్ను వసూలు చేయకూడదంటూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఫలితంగా సంబంధిత సంస్థకు చెల్లింపులు నిలిచిపోవడంతో వాహనాలను ఆపేశారు. కొద్ది రోజుల పాటు చెత్త తరలింపు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. సంస్థతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహణ భారాన్ని ప్రభుత్వం భరించే విధంగా హామీ ఇచ్చారు. దీంతో వాహనాలు రోడ్డెక్కాయి. వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను వేరుగా సేకరించేందుకు అవకాశం ఉంటుంది.

నిర్వహణ భారం ఇలా..

నగరంలో మొత్తం 95 సచివాలయాలున్నాయి. ఇంటింటా చెత్త సేకరణకు 90 వాహనాలు పైగా ఏర్పాటు చేశారు. వీటితో పాటు నగరపాలక సంస్థ కొనుగోలు చేసిన 14 వాహనాలు తిరుగుతున్నాయి. వాహనాలు నిర్వహణ, సిబ్బంది జీతాలు, ప్రతి నెలా అద్దె చెల్లింపు భారం ఇకపై ప్రభుత్వంపై పడుతుంది.

నగరంలో మొత్తం నివాసాలు	: 99,758
నిత్యం విడుదలయ్యే చెత్త	: 160 మెట్రిక్ టన్నులు
చెత్త తరలింపు వాహనాలు	: 104
ప్రతినెలా నిర్వహణ ఖర్చు	: రూ.40 లక్షలకు పైగా

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మోదీ కృషి

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ కట్టుబడి ఉన్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో న్యాయవాది, సామాజిక సేవకురాలు, హ్యూమన్ రైట్స్, దళిత్ రైట్స్ యాక్టివిస్ట్ విజయ చీలి మాదిగ సామాజిక వర్గానికి చెందిన అనుచరులతో పురందేశ్వరి సమక్షంలో భాజపాలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఎంపీ భాజపాలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరినవారు మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భాజపాను మరింత బలోపేతం చేయడంతోపాటు మోదీకి అన్ని విధాలా అండగా నిలబడాలని కోరారు. విజయ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రేలంగి శ్రీదేవి, యెనుముల రంగబాబు, అడబాల రామకృష్ణారావు, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధాకృష్ణ, రొంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్, ఆకుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురందేశ్వరి

వృద్ధురాలికి ఆశ్రయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తుమ్మిడి నాగరత్నం అనే 75 ఏళ్ల వృద్ధురాలు పుష్కరాల రేవులో ఆత్మహత్యకు యత్నించడంతో ఆమెను చిరు వ్యాపారులు కాపాడి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల విన్నపం మేరకు రెండురోజుల క్రితం లాలాచెరువులోని స్వర్ణాంధ్రా వృద్ధుల కేంద్రంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు చెప్పారు. బాధిత మహిళ నాగరత్నం వివరాల ప్రకారం... భర్త మూడేళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వయసు మీద పడడం, అయినవారి ఆదరణ కరవై ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా వస్తే వారికి వృద్ధురాలిని అప్పగిస్తామని రాంబాబు చెప్పారు.

మూలకాలే పురోభివృద్ధి హేతువులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మూలకాలు అన్ని రకాల పదార్థాలకు ప్రాథమిక ప్రమాణాలని విశ్రాంత ప్రిన్సిపల్ పి.శ్రీరామమూర్తి అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెగ్నీషియం, పొటాషియం, ఇల్లు కట్టడానికి అల్యూమినియం, ఐరన్, ఎలక్ట్రికల్ పరికరాల తయారీలో సిలికాన్ కాపర్, గోల్డ్ లాంటి మూలకాలకు ఒక ప్రత్యేక ధర్మం ఉండడం వల్ల అవి నిత్యజీవితంలో మానవుని పురోగతికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపకులు వి.దీప్తి, ఎం.శిల్పారాణి, పి.వి.బి.సంజీవరావు, పాల్గొన్నారు.



చెట్టు కొమ్మే ప్రమాద సూచిక!

నగరంలోని నిత్యం రద్దీగా ఉండే గాంధీపురం ప్రాంతంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వీధిలో పరిస్థితి ఇది. మ్యాన్‌హోల్ మూత పూర్తిగా పాడై ప్రమాదకరంగా కనిపిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు సంచరించే ప్రధాన రహదారి కావడంతో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పాఠశాల బస్సును ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రాజమహేంద్రవరం నేరవార్తలు: పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సును ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన నగరంలోని లలితానగర్ వాటర్ ట్యాంకుల రోడ్డులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు, పోలీసులు వివరాల మేరకు.. గ్రామీణం ప్రాంతానికి చెందిన ఓ పాఠశాల బస్సు 15 మంది విద్యార్థులతో పేపరు మిల్లు మార్గం మీదుగా కంబాలచెరువు కూడలికి వస్తుండగా అదే మార్గంలో వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పాఠశాల బస్సు వెనక ఢీకొంది. ఈ ఘటనలో పాఠశాల బస్సు పాక్షికంగా దెబ్బతింది. జరిగిన ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

వివాహిత అదృశ్యం

రాజమహేంద్రవరం నేరవార్తలు: బ్రిడ్జిలంక ప్రాంతానికి చెందిన ఓ వివాహిత(21) గత నెల 30 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త గురువారం మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని గాయాలు

పప్పులవారి వీధికి చెందిన ఎన్.రాజేష్ బుధవారం రాత్రి గోదావరి బండ్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో..

బర్మాకాలనీకి చెందిన ఎండీ మునావర్ గురువారం వేకువ జామున ద్విచక్ర వాహనంపై లాలాచెరువు సర్వీసు రోడ్డులో వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు గాయం కావడంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు ప్రకాశంనగర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాయి.



అలంకరణలో కన్యకాపరమేశ్వరి



అక్షరకోటి గాయత్రీ పీఠంలో అమ్మవారికి అలంకరణ



శివకామేశ్వరీ పీఠంలో చంద్రగ్రహ మండపారాధన



సరస్వతీ పీఠంలో ఉత్సవాలకు కలశస్థాపన

కొలువుదీరె అమ్మ...

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న నగరంలో గురువారం దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీఉమామార్కండేయస్వామి ఆలయంలో స్వయంభువుగా వెలసిన పార్వతీ అమ్మవారి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గణపతి పూజతో మొదలయ్యాయి. పట్టువస్త్రాలతో అమ్మవారి విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తికి శ్రీబాల అవతారంలో అలంకరించి సహస్రనామ పారాయణం చేశారు. సీతంపేట రామాలయంలో మహాలక్ష్మీ అమ్మవారికి, సరస్వతీ పీఠంలో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారికి పట్టువస్త్రాలతో అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు.

✦ గోదావరిగట్టున ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మూలవిరాట్‌కు పసుపు కుంకుమలతో అలంకరించి హారతి సమర్పించారు. కొత్తపేట పెద్దవీధిలో ఫ్రెండ్స్ సర్కిల్ సారథ్యంలో వేడుకలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ✦ గౌతమఘాట్‌లోని అక్షరకోటి గాయత్రీ పీఠంలో, శ్రీఉమాకోటిలింగేశ్వర స్వామివారి ఆలయంలో కొలువైన భువనేశ్వరీ అమ్మవారి సన్నిధిలో, జాంపేట మార్కెట్ సమీపంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో, గాంధీబొమ్మ సమీపంలో శ్రీకనకదుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ✦ జేఎన్ రోడ్డులోని శివకామేశ్వరీ పీఠంలో ఈమని దక్షిణామూర్తి సిద్ధాంతి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు జరిగాయి.

సాయినగర్‌లో ప్రత్యేక పూజలు ప్రారంభం

వి.ఎల్.పురం : మోరంపూడి సాయినగర్-2లోని కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు ప్రారంభించారు.

దేవీచౌక్ అమ్మవారిని దర్శించుకున్న పురందేశ్వరి

దేవీచౌక్: దేవీచౌక్ అమ్మవారిని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఎంపీకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎంపీకి జ్ఞాపిక అందజేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఒరిగిన స్తంభం



స్తంభం అడుగు భాగం దుస్థితి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: అల్కట్‌తోట కన్నమాంబ వీధిలో అడుగున పాడైన స్తంభం ఒకటి పూర్తిగా ఒరిగి ఆరు నెలలుగా ప్రమాదకరంగా ఉంది. పిల్లలు వీధుల్లో తిరుగుతుంటారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో భయంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూత ఏర్పాటు

స్పందనకు వందనం



నాడు ప్రమాదకరంగా(పాత చిత్రం)



ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని రామకృష్ణ థియేటర్ రహదారి మలుపులో భూగర్భ కాలువపై మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో పరిస్థితిపై గత నెల 19న 'ఈనాడు'లో ప్రచురించిన 'ఆదమరిస్తే అనర్థం' చిత్ర వార్తకు సంబంధిత అధికారులు స్పందించి మూత ఏర్పాటు చేశారు.

ధర కనిపించకుంటే ఎలా?

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లోని కొందరు స్టాల్స్ నిర్వాహకులు శీతలపానీయాలు, బిస్కెట్లు, జంక్ ఫుడ్ ప్యాకెట్లతోపాటు ఇతర తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. ప్రతి స్టాల్ వద్ద ఎమ్మార్పీ పట్టిక వినియోగదారులకు కన్పించేవిధంగా ప్రదర్శించాలి. ఇక్కడి కొన్ని స్టాల్స్ వద్ద పట్టిక కన్పించకుండా తినుబండారాల ప్యాకెట్లతో కప్పివేస్తున్నారు. దసరా పండగ వేళ ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు అనుగుణంగా ప్లాట్‌ఫామ్‌పై ఉన్న స్టాల్స్‌లో ఎమ్మార్పీకి విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై కేటరింగ్ ఇన్‌స్పెక్టర్ దేవానంద్ వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే స్టాల్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం



స్టాల్ వద్ద ధరల పట్టిక కన్పించకుండా ఇలా మూత

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: కోటిపల్లిబస్టాండ్ సమీపంలోని సబ్బవరపువారి వీధిలో రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. - **శ్రీధర్**

సమస్య: తారకరామనగర్ పిల్లివారివీధిలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదు. ఇక్కడ పాముల బెడద కూడా ఎక్కువగా ఉన్నందున తక్షణం వీధిదీపాలకు మరమ్మతులు చేయాలి. - **వెంకటలక్ష్మి**

సమాధానం: లూథర్‌గిరి, మున్సిపల్‌కాలనీకి మధ్యవీధిలో 25 రోజులుగా వీధిదీపాలు వెలడం లేదు. - **జార్జి**

సమాధానం: వీధిదీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - **ఎలక్ట్రికల్ ఏఈ, నగరపాలకసంస్థ**

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్యలపై సంప్రదించాల్సిన నంబర్లు

80089 02897
83282 39927

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి


సామూహిక సచ్చరిత్ర పారాయణం చేస్తున్న భక్త మండలి

11 వారాల సామూహిక సచ్చరిత్ర పారాయణం

రాజానగరం: లోకకళ్యాణార్థం రాజానగరంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో 11 వారాలుగా సామూహిక సచ్చరిత్ర పారాయణం నిర్వహిస్తున్నారు. ఏటా ఈ పూజా కార్యక్రమాలు ఆలయంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పారాయణం చేసిన భక్తమండలిని ఆలయ కమిటీ దుశ్శాలువలతో సత్కరించారు.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, రాజా, వీనస్ మహల్, అశోక్, కుమారి, సూర్యప్యాలెస్, అప్సర: దేవర, అనుశ్రీ: స్వాగ్, సూర్యమినీ: దక్షిణ, శివజ్యోతి: రామ్ నగర్ బన్నీ, స్వామి: జోకర్, రంభ: కలి, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ (రెండు ఆటలు).

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్: మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సైక్లోన్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, బత్తినగర్, ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.




వడిశలేరులో పూల అలంకరణలో | గోకవరం: బాలాత్రిపుర సుందరీ దేవిగా దుర్గాదేవి | బిక్కవోలులో..

దుర్గమ్మ కొలువై.. భక్తికి నెలవై


కడియం: శ్రీదుర్గాదేవి పీఠం వద్ద తొలిపూజలు ఆచరిస్తున్న భక్తులు


చక్రద్వారబంధంలో దేవీచౌక్ వద్ద స్వర్ణకవచంతో అమ్మవారు

న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ప్రారంభం కావడంతో దుర్గమ్మ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల భవానీ భక్తులు మండపాలను సుందరంగా ముస్తాబుచేసి అమ్మవారిని నెలకొల్పారు. ● కడియంలో శ్రీదేవి ఆలయం వద్ద భారీ సెట్టింగులు, విద్యుద్దీపాలతో మండపం అలంకరించారు. నేతి నానాజీ అమ్మవారికి నైవేద్యంగా ప్రత్యేకంగా తయారు చేసిన 95కేజీల భారీ లడ్డూను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ● మోరంపూడి సాయినగర్-2లోని కనకదుర్గమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ● గోకవరంలోని దేవీచౌక్ వద్ద అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. ● హుకుంపేట ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శైలపుత్రి అవతారంలో అమ్మవారు అందరినీ ఆకట్టుకున్నారు. ● బిక్కవోలు శ్రీగోలింగేశ్వర దేవాలయంలో పార్వతీ దేవిని బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. బలభద్రపురంలో ఆంధ్రషిరిడి, శ్రీదేవి, భూదేవి సహిత ప్రసన్న వెంకటేశ్వరస్వామి, దుర్గాదేవి ఆలయాల్లో దేవీ ఉత్సవ పూజలు ప్రారంభం అయ్యాయి.




బాలాజీపేట కనకదుర్గ ఆలయంలో.. | మోరంపూడి సాయినగర్ లోని ఆలయంలో.. | బొమ్మూరు కనకదుర్గ ఆలయంలో...


విద్యార్థులు తయారు చేసిన చిన్నారుల దుస్తులు

నైపుణ్య శిక్షణతో ఆర్థిక భరోసా

కూటమి కృషితో మహిళల్లో ఆనందం

బొమ్మూరు, న్యూస్‌టుడే: మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వారికి ఉచిత నైపుణ్య శిక్షణను కూటమి ప్రభుత్వం అందిస్తోంది. వైకాపా హయాంలో వీటిని పూర్తిగా గాలికి వదిలేసినా కూటమి ప్రభుత్వం కొలువు తీరిన కొద్ది రోజులకే దీనిపై దృష్టి సారించడంతో శిక్షణ పొందుతున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొమ్మూరు మహిళా ప్రాంగణంలో మొదటి విడతగా నెల రోజులపాటు కుట్టుమిషన్, బ్యూటీపార్లర్ కోర్సులపై శిక్షణను గత నెలలో ప్రారంభించారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో రావడంతో రెండవ బ్యాచ్ ఏర్పాటుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బొమ్మూరు, రాజవోలు, రాజమహేంద్రవరం నుంచి విద్యార్థులు ఈ శిక్షణ పొందుతున్నారు. ఇందులో విద్యార్థులకు నెల రోజుల్లో 11 పాఠ్యాంశాలను వివరిస్తారు. దుస్తులు కుట్టడం, డిజైన్ వర్క్, నెక్ మోడల్స్ తదితరాలను నేర్పుతున్నారు. ఉచితంగా సామగ్రిని కూడా అందిస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ కొనసాగిస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటా..



కుట్టుమిషన్ నేర్చుకుని ఇంటి వద్దే సొంతంగా చిన్న వ్యాపారం పెట్టుకోవాలని అనుకుంటున్నాను. ఇదే శిక్షణ బయట పొందాలంటే నెలకు రూ.4 వేలు పైనే ఫీజు కుంటున్నారు. ప్రాంగణంలో ఉచితంగా నేర్పించడం చాలా ఉపయోగంగా ఉంది. ఈ శిక్షణ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాను. - రూన్సీ రాణి, రాజవోలు

రుణం తీసుకొని వ్యాపారం చేస్తా..



శిక్షణ అనంతరం కొంతమందితో కలిసి రుణం తీసుకుని వ్యాపారం చేయాలనుకుంటున్నాను. దీంతోపాటు ఈ విద్యను ఇంటివద్ద ఖాళీ వేళల్లో వాళ్లకి నేర్పాలనుకుంటున్నా. ఈ శిక్షణ అనంతరం రోజు ఇంటి వద్ద పనిచేస్తూ కుటుంబ అవసరాలకు, విద్యార్థుల చదువులకు డబ్బు సంపాదిస్తా. - డి.ఈశ్వరి, బొమ్మూరు

త్వరలో కొత్త కోర్సులు అందిస్తాం..

జిల్లా మహిళా ప్రాంగణంలో కోర్సులు ఉచితంగా నేర్పిస్తాం. త్వరలో కొత్త కోర్సులు వచ్చే అవకాశం ఉంది. బ్యాచ్ వారీగా శిక్షణ ఉంటుంది. అభ్యర్థుల అర్హతలకు తగ్గట్టుగా కోర్సులు ఉంటాయి. బ్యూటీషియన్, కుట్టుమిషన్ శిక్షణలో 60 మంది తర్ఫీదు పొందుతున్నారు. కోర్సులు నేర్చుకోవాలని అనుకునేవారు ప్రాంగణంలో సిబ్బందిని సంప్రదించవచ్చు.

- నర్సమ్మ, మహిళా ప్రాంగణం ఇన్‌ఛార్జి మేనేజర్

వారంలోనే గౌన్లు కుడుతున్నా..



శిక్షకురాలు మా ఆలోచన విధానానికి తగ్గట్టుగా నేర్పిస్తున్నారు. వారం రోజుల్లో గౌన్లు తదితరాలు కుట్టడం నేర్చుకున్నా. రోజుకు ఒక జాకెట్ తయారు చేసినా రూ.300 సంపాదించ వచ్చు. సృజనాత్మకత ఇందులో చాలా అవసరం. - చాందిని, రాజమహేంద్రవరం

ఎంతోమంది ఎదురు చూస్తున్నారు..



అందరూ స్నేహంగా ఉంటూ శిక్షణలో నైపుణ్యాలు నేర్చుకుంటున్నాం. కుట్టుమిషన్ పనికి ఎప్పుడూ గిరాకీ ఉంది. మహిళలు ఎంతోమంది ఈ పని నేర్చుకోవాలని తపన పడుతున్నారు. ప్రభుత్వం కుట్టు మిషన్లు అందిస్తే మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. - దేవి, రాజమహేంద్రవరం


గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల

స్థానిక పరిపాలనలో సువర్ణాధ్యాయం

పుణ్యక్షేత్రం, (రాజానగరం) న్యూస్‌టుడే: స్థానిక పరిపాలనలో కూటమి పాలన సువర్ణాధ్యాయమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని పుణ్యక్షేత్రంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామసభ ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వరరావు, ఎం.చిన్నవెంకటేశ్వరరావు, పేపకాయల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయడంలో భాగంగా హుకుంపేట పంచాయతీ గ్రామసభ నిర్వహించామని ఏపీవో బి.వి.సత్యవతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ చెరువులు శుభ్రపరడం, ప్రధాన కాలువలు పూడికతీత చేపట్టడం వంటి పనులు గ్రామస్థులు తెలిపారన్నారు. మరిన్ని పనులను గుర్తించాలని అన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్వాక్రా నగదు గోల్‌మాల్‌పై విచారణ ప్రారంభం

కడియం: కడియపులంక పరిధిలోని డ్వాక్రా బృందాల నగదు లావాదేవీల్లో రూ.లక్షల్లో అక్రమాలకు పాల్పడ్డ వీఓలపై చర్యలు కోరుతూ ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి సర్పంచి పాటంశెట్టి రాంజీ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు జరిగిన అవినీతిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 15 బృందాలు రంగంలోకి దిగాయి. డీఆర్‌డీఏ ఉన్నతాధికారుల బృందం గురువారం ఉదయం కడియపులంక గ్రామపంచాయతీలో రాంజీ సమక్షంలో విచారణ ప్రారంభించింది. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం ఎం.ధర్మేంద్ర, డీపీఎం వై.జనార్దనరావు, వెలుగు ఏపీఎం అప్పలకొండతోపాటు బాధిత డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


కడియపులంకలో దస్త్రాలను పరిశీలిస్తున్న అధికారులు

భాజపాలో చేరిన మద్దాల

సీతానగరం: వైకాపా ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మద్దాల కొండలరావు భాజపాలో చేరారు. రాజమహేంద్రవరం పార్టీ కార్యాలయంలో ఎంపీ పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నీరుకొండ వీరన్నచౌదరి ఆయనకు సభ్యత్వాన్ని గురువారం నమోదు చేయించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఘోర పరాజయం అనంతరం సీతానగరానికి చెందిన మద్దాల ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేశారు. కాగా మండలంలోని పలువురు నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఇసుక నిల్వ కేంద్రం పరిశీలన

రంగంపేట, న్యూస్‌టుడే: ఏడీబీ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రిని కోటపాడు పంచాయతీ పరిధిలోని రామేశ్వరంపేటలో నిల్వ చేశారు. ఈ ఇసుకను రాత్రులు అక్రమంగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదు అధికారులకు అందింది. దీంతో గురువారం రంగంపేట ఇన్‌ఛార్జి తహసీల్దారు ఉండవిల్లి రంజిత్ కుమార్, ఆర్ఐ గోపిచంద్, ఎస్సై తోట కృష్ణసాయి ఇసుక నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. ఇసుక నిల్వ మైనింగ్ పరిధిలోనిదని, ఆ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు. దీనిపై పరిశీలన కొనసాగుతుందన్నారు.

వేతన బకాయిల కోసం ఆందోళన


సమ్మెలో సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

వి.ఎల్.పురం: గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని సత్యసాయి పథకంలో పనిచేస్తున్న తమకు 16 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం లాలాచెరువు భాస్కర్‌నగర్ వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు సందర్శించి మద్దతు తెలిపారు. మెట్ట, గిరిజన ప్రాంతాల్లోని ఆయా మండలాలకు తాగునీరు అందించే సత్యసాయి పథకంలో 18 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గుత్తేదారుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సరైన సమాధానం చెప్పడంలేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉన్నప్పటికీ ఆ ఖాతాల్లో డబ్బులు జమకావడంలేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతా మట్టే... నడిస్తే బురదే



పాతబొమ్మూరుకు వెళ్లే మార్గంలో గుంతలు, బురదతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలువ నుంచి వస్తున్న మురుగు రోడ్డుపైకి చేరుతుండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కొన్ని చోట్ల పైపులైను లీకుల వల్ల నీరు వృథాగా రోడ్డుపైకి చేరుతోంది. వేగంగా వాహనాలు వెళుతుంటే బురద నడిచే వారిపై పడుతోందని.. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. పాతబొమ్మూరు మార్గంలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామని కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మోదీ కృషి

దేవీచౌక్(రాజమహేంద్రవరం): దేశంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రధాని మోదీ కట్టుబడి ఉన్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో న్యాయవాది, సామాజిక సేవకురాలు, హ్యూమన్ రైట్స్, దళిత్ రైట్స్ యాక్టివిస్ట్ విజయ చీలి మాదిగ సామాజిక వర్గానికి చెందిన అనుచరులతో పురందేశ్వరి సమక్షంలో భాజపాలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఎంపీ భాజపాలోకి ఆహ్వానించారు. పురందేశ్వరి మాట్లాడుతూ మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భాజపాను మరింత బలోపేతం చేయడంతోపాటు మోదీకి అన్ని విధాలా అండగా నిలబడాలని కోరారు. విజయ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రేలంగి శ్రీదేవి, యెనుముల రంగబాబు, అడబాల రామకృష్ణారావు, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధాకృష్ణ, రొంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్, ఆకుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: సీతానగరం నుంచి పురుషోత్తపట్నం చేరే 10.5 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలు సాగించలేకపోతున్నాం. పోలవరం ఫెర్రీరేవుతో పాటు పోశమ్మగండికి ఈ దారి నుంచే వెళ్లాల్సి ఉంది. వంగలపూడి, సింగవరం, రామచంద్రపురం గ్రామాల నుంచి బయటకు రావాలంటే గోతులమయంగా మారిన రోడ్డులో నరకయాతన పడుతున్నాం. కనీసం గోతులైనా పూడ్చండి. - వి.దీపిక, సింగవరం

సమాధానం: ఏటిగట్టును ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసేలా సుమారుగా రూ.11 కోట్ల నిధులతో అంచనాలు సిద్ధం చేశాం. మంజూరు కాగానే అయిదు అడుగుల వెడల్పున రోడ్డు పనులు పూర్తిచేస్తాం.

- రవి, పంచాయతీరాజ్ డీఈ - న్యూస్‌టుడే, సీతానగరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

రూ.లక్షలు వెచ్చించినా.. బీపీ చూసేందుకు లేదు!

సీతానగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో నిర్మాణం చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎన్నికల వేళ ప్రారంభోత్సవాలు చేసి వదిలేశారు. వైద్యఆరోగ్యశాఖకు ఇప్పటికీ ఈ భవనాలను అప్పగించకపోవడం విశేషం. సీతానగరం మండలంలో ఒక్కో కేంద్రం సుమారుగా రూ.20 లక్షల నిధులతో 19 చోట్ల మంజూరు చేశారు. మూడుచోట్ల స్థలాలు దొరకలేదని వదిలేశారు. ఒక కేంద్రాన్ని పునాదుల్లోనే వదిలేశారు. మిగతా 15 కేంద్రాలు ఎన్నికల సమయంలో శిలాఫలకాలు వేసుకునేందుకు వైకాపా నాయకులు పోటీపడ్డారు. మూడు కేంద్రాల మినహా విలేజ్ హెల్త్‌క్లినిక్‌లకు విద్యుత్తు, తాగునీరు సరఫరా లేదు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల్లోనే సిబ్బంది 24 గంటలూ ఉండేలా క్వార్టర్స్ నిర్మాణం చేశారు. విద్యుత్తు, తాగునీరు సదుపాయం లేకపోవడంతో వీరు పలు అవస్థలు పడుతున్నారు. కనీసం అత్యవసర పరిస్థితుల్లో రోగి వస్తే ముందుగా చూడాల్సిన రక్తపోటు పరీక్షకు విద్యుత్తు లేక పరికరం పనిచేయకుండా ఉంది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వైద్యఆరోగ్యశాఖకు అప్పగించలేదని విద్యుత్తు, తాగునీరు పంచాయతీ రాజ్‌శాఖ ఏర్పాటుచేయాల్సి ఉందని సీతానగరం పీహెచ్‌సీ ప్రధానవైద్యుడు ఏవీకే చైతన్య తెలిపారు.




చినకొండేపూడి విలేజ్ హెల్త్ క్లినిక్, విద్యుత్తు లేకపోవడంతో పనిచేయని బీపీ పరికరం

తాగునీటి సమస్యపై ధ్వజమెత్తిన ప్రజలు

సీతానగరం, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యతో అల్లాడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని కూనవరం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ పాలనా తీరుపై పలువురు మండిపడ్డారు. పంచాయతీకి వచ్చిన నిధులపైనా సరైన లెక్కలు లేకుండా ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్నారు. చెరువుల ద్వారా వచ్చిన ఆదాయం ఏమైందో చెప్పాలని పట్టుబట్టారు. గ్రామసభ గందరగోళంగా మారడంతో సమస్యలపై వచ్చిన సామాన్య ప్రజలు వెనక్కి వెళ్లిపోయారు. కాగా, రూ.60 లక్షలలో తాగునీటి పథకం గత ప్రభుత్వంలో మంజూరైందని.. గుత్తేదార్లు ముందుకు రాకపోవడం వల్ల తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని కార్యదర్శి సుధాకర్ తెలిపారు.

డీజేలు వద్దు - సంప్రదాయ వాయిద్యాలు ముద్దు


మాట్లాడుతున్న సీఐ శివగణేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రామగుర్రెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పండుగలు, శుభాకార్యాలలో భారీ శబ్దాలు చేసే డీజేలు వినియోగించవద్దని అనపర్తి సీఐ శివగణేష్ సూచించారు. డీజేలు, శబ్ద కాలుష్యానికి సంబంధించి గురువారం అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.తాడి రామగుర్రెడ్డితో కలిసి సీఐ శివగణేష్ విలేకరులతో మాట్లాడారు. పండుగలు ఆహ్లాదకర వాతావరణంలో చేసుకోవాలన్నారు. డీజేలు వద్దు-సంప్రదాయ వాయిద్యాలు ముద్దు అనే నినాదంతో అందరూ పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. డీజే శబ్దాలపై తమకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. శృతిమించిన శబ్దాలతో చెవులు దెబ్బతింటాయిని డా.తాడి రామగుర్రెడ్డి అన్నారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పంచాయతీలో రికార్డులు లేకుండా పాలన ఎలా!

సీతానగరం, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీలో సుమారుగా రూ.80 లక్షలకు పైబడి నిధుల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి మూడునెలలు కావస్తున్నా.. ఇంతవరకు దానిపై చర్యలు తీసుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని మాజీ ఉప సర్పంచి కాండ్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. అతి పెద్దపంచాయతీగా ఉన్నా నిధుల లేమితో పనులు చేయలేక అవస్థలు తప్పడం లేదన్నారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అన్ని రికార్డులను డీఎల్‌పీవో, జిల్లా ఆడిటర్ స్వాధీనం చేసుకున్నారన్నారు. ఏ పనికి తీర్మానం చేయాలన్నా రికార్డులు లేవంటున్నారని పాలకవర్గ సభ్యులు చుండ్రు సత్యప్రసాద్, కొండ్రు బుజ్జి, మునికోటి అనంతలక్ష్మి, తాడి పైడమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, నాయకులు

వరిలో సమగ్ర సస్యరక్షణ పాటించాలి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ కృష్ణ, ఏవో సురేష్‌కుమార్ పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పంటకు ఎండాకు తెగులు సోకిందని, రైతులు సమగ్ర సస్యరక్షణ పాటించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామసర్పంచి గంగాభవాని, కుతుకులూరు గ్రామసర్పంచి హేమతులిసి, పలువురు కూటమి నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గైట్‌లో జాతీయ సమైక్యతా శిబిరం



రాజానగరం, న్యూస్‌టుడే: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల మూడో తేదీ నుంచి 13వ తేదీ వరకు ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహిస్తున్నామని **మేజర్ డిప్యూటీ క్యాంప్ కమాండర్ అసిఫ్ సాహెబ్** తెలిపారు. ఈ శిబిరానికి దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల నుంచి 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారన్నారు. వీరికి ప్రతీ రోజూ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమైక్యతాభావం, దేశభక్తి వారిలో పెంపొందుతాయన్నారు. వీరికి పరిశ్రమలు, వివిధ సంస్థల సందర్శన, మొక్కలు నాటడం, రక్తదానం శిబిరాలు నిర్వహించడం వంటివి చేపడతామన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

అనపర్తి గ్రామీణం: అనపర్తి ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో రాంబాబు యువ సేన, సంజీవనీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 14వ రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 44 మంది యువకులు రక్తదానం చేయగా వారికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. 14 ఏళ్లుగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా.. ఆవసరమైన ప్రతి ఒక్కరికి రక్తం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కాలువల కొరత.. మురుగుతో చింత

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఆరువేల జనాభా కలిగిన బిక్కవోలు మండలం రంగాపురం పంచాయతీని డ్రెయినేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. చాలా వీధులకు కాలువలు లేక మురుగు, ఇళ్లలో వాడకపు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. 2014 సంవత్సరానికి పూర్వం నుంచే ఇక్కడ సమస్య ఉంది. అప్పట్లో ఉపాధి హామీ నుంచి ఇంకుడు గుంతలు తవ్వారు. ఇంట్లో వాడకపు నీరు ఇంకుడు గుంతలకు పోయేలా ప్రజలు ఏర్పాట్లు చేసుకోవడంతో అప్పటికి కొంతవరకు సమస్య పరిష్కారం అయ్యింది. ఇంకుడు గుంతలు తీసి పదేళ్లు దాటిపోవటం, వాటిని శుభ్రం చేయక పోవటంతో ప్రస్తుతం నీరు భూమిలో ఇంకటం లేదు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. నీరు ఇంకక రోడ్లపైనే మురుగంతా తిష్ఠ వేస్తోంది. అది ఆరడానికి కొన్ని రోజులు పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు.


ఓ ఇంటి ముందు ఇంకుడు గుంత


గుంత నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న వాడకపు నీరు

నిధులు లేక..

పంచాయతీ వద్ద నిధులు లేక కాలువల నిర్మాణం కుంటుపడుతోంది. ఏటా దాదాపు రూ.20 లక్షల వరకు పంచాయతీకి ఆదాయం వస్తుంది. ఇందులో రూ.10 లక్షలు చేపల చెరువుల నుంచే లభిస్తుంది. వచ్చిన ఆదాయంలో సిబ్బంది జీతాల రూపేణా రూ.13.5 లక్షల ఖర్చు ఉంటుంది. పంచాయతీ అవసరాలైన బ్లీచింగ్, వీధి లైట్లు వగైరాలకు ఏటా రూ.మూడు లక్షలు ఖర్చు అవుతోంది. విద్యుత్తు బిల్లులు ఏటా రూ. 12 లక్షలు ఉంటున్నా పంచాయతీ వద్ద నగదు లేకపోవటంతో సకాలంలో చెల్లించలేక పోతున్నారు. గ్రామంలో 6.2 కి.మీ సీసీరోడ్లు మాత్రం నిర్మించారు. వీటికి 2.5 కి.మీ మేర మాత్రమే డ్రెయిన్లు ఉన్నాయి. 2.5 కి.మీ మేర కచ్చా డ్రెయిన్లు నిర్మించినా వాటి వల్ల ప్రయోజనం లేకుండా ఉంది. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా మురుగునీటి కాలువల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కొన్ని చోట్ల కాలువల నిర్మాణం చేపట్టామని.. మిగిలిన చోట కూడా చేపడతామని తెలిపారు.

రెండ్రోజులు బస్సు పాసుల జారీకి సెలవు

కొవ్వూరు పట్టణం: బస్సు పాసుల జారీ ప్రక్రియ రెండ్రోజులపాటు నిలిపివేస్తున్నట్లు కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ తెలిపారు. నూతన సాఫ్ట్‌వేరును నిక్షిప్తం చేసే ప్రక్రియలో భాగంగా ఈ నెల 5, 6 తేదీలను సెలవుగా ప్రకటించామన్నారు. 7వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా పాసుల అందించే చర్యలు తీసుకుంటామన్నారు.

రాయితీపై పనిముట్లు అందించాలి

గోపాలపురం: మండలంలోని గోపాలపురం, చిట్యాల గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిసాగులో మెలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా పర్యవేక్షణ అధికారి బి.శాంతా ఆలివ్ తెలిపారు. వ్యవసాయ పనిముట్లు (స్ప్రేయర్లు, తార్పాలిన్లు, డ్రోన్లు, జింక్, జిప్సం రాయితీపై అందజేయాలని రైతులు కోరారు. పశువుల సంబంధించిన టీకాలు, మందులు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

చాగల్లు ఎంపీడీవోగా శ్రీదేవి

చాగల్లు, న్యూస్‌టుడే: చాగల్లు ఎంపీడీవోగా ఆర్.శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గోపాలపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. ఆమెకు ఎంపీపీ వీరాస్వామి, మండల పరిషత్తు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


ఎంపీడీవో శ్రీదేవికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎంపీపీ వీరాస్వామి


చాగల్లు : ప్రత్యేకాలంకరణలో అమ్మవారు


వేగేశ్వరపురంలో..


దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్‌లో..


ఖండవల్లి వినాయకుడి గుడివద్ద..


ఆవపాడులో..


పల్లంట్లలో దాతలు బహూకరించిన ఇత్తడి విగ్రహం


వెల్లచింతలగూడెంలో దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటరాజు

కల్పవల్లి.. భక్తులు ప్రణమిల్లి


కొవ్వూరులో కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తి ఊరేగింపు


నిడదవోలులో అమ్మవారిని దర్శించుకున్న పురపాలక ఛైర్మన్ ఆదినారాయణ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గ పరిధిలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీచక్ర సహిత కుంకుమార్చనలు, కలశ స్థాపనలు నిర్వహించి అమ్మవారికి పూజా కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల వద్ద చలువపందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రధాన కూడళ్ల వద్ద అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. కొవ్వూరులో జ్ఞాన సరస్వతిదేవి, శ్రీలలితాపార్వతీదేవి, బాలాత్రిపురసుందరి, కుమారదేవం గండిపోచమ్మ ఆలయాల్లో పూజల అనంతరం విశేషాలంకరణలు చేశారు. ● చాగల్లు, ఊనగట్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు పట్టు వస్త్రాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ● తాళ్లపూడిలోని నవదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ● కోటసత్తెమ్మ ఆలయంలో దేవులపల్లి కుటుంబసభ్యుల కలశస్థాపన పూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సహస్రనామ కుంకుమపూజల్లో 132 మంది దంపతులు పాల్గొన్నారు. పట్టణంలోని చింతచెట్టు వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మన వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ చింతచెట్టు వీధి, వడ్డీలవీధి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ● పల్లంట్లలో కొలువైన రాజరాజేశ్వరి దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో గన్నమని సత్యప్రసాద్-రమాదేవి, పాలచర్ల అనిల్ చౌదరి-లీలాస్పందన దంపతులు రూ.70 వేలతో 65 కేజీల బరువు ఉన్న ఇత్తడి విగ్రహాన్ని బహూకరించారు. అనంతరం 108 కలశాలతో భవానీభక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. ● గోపాలపురం మండలం వెల్లచింతలగూడెంలో దుర్గామాతను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దర్శించుకున్నారు. ● ఆవపాడు విజయదుర్గమ్మ ఆలయం వద్ద భవాని మాల ధారులు నిప్పుల గుండం ఏర్పాటు చేశారు.

–న్యూస్‌టుడే, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల


కలశస్థాపన పూజతో ప్రారంభమైన కోటసత్తెమ్మ దసరా వేడుకలు



విస్తరణ సరే.. విద్యుత్తు స్తంభాల మాటేంటి..?

నల్లజర్ల నుంచి ప్రకాశరావుపాలెంకి వెళ్లే బీటీ రహదారి పక్కన నల్ల, ఎర్ర చెరువు మలుపులో రెండు విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల ఈ బీటీ రహదారిని విస్తరించారు. అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. కాని విద్యుత్తు స్తంభాలను మార్చకపోవడంతో అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల కాంతికి రోడ్డు పక్కనున్న ఈ స్తంభాలను చోదకులు గుర్తించలేకపోతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతోమంది గాయాలపాలవుతున్నారు. అయినా సంబంధి అధికారులు పట్టించుకోలేదని స్థానికులు, వాహనచోదకులు విమర్శిస్తున్నారు. దీనిపై ర.భ.శాఖ అధికారిని వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, నల్లజర్ల

యంత్రాంగం సమన్వయంతో పని చేయాలి

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రాణి సుష్మిత గురువారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి రానున్న పుష్కరాలు, నియోజకవర్గ అభివృద్ధి తదతర అంశాలపై కొద్దిసేపు చర్చించారు.


ఎమ్మెల్యే ముప్పిడికి మొక్క అందిస్తున్న ఆర్డీవో రాణి సుష్మిత

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

సమస్య: స్థానిక ప్రాథమిక పాఠశాల వీధిలోని డ్రెయిన్‌లో వ్యర్థాలు చేరడంతో మురుగు పారడం లేదు. దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- స్థానికుడు, వేగేశ్వరపురం

సమాధానం: డ్రెయిన్‌ను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

- శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి

–న్యూస్‌టుడే, తాళ్లపూడి

సమస్య: ఉండ్రాజవరం మండలంలోని పాలంగి నుంచి తణుకు వెళ్లే ప్రధాన సిమెంటు రహదారి బీటలు తీసింది. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతు పనులు చేయించాలి.

- కె.రామారావు, పాలంగి

సమాధానం: రహదారి పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- సీహెచ్ శ్రీనివాసు, ఏఈ, ర.భ.శాఖ

– న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

గ్రామాల అభివృద్ధే లక్ష్యం కావాలి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పని చేయాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సూచించారు. ఎంపీపీ యల్లారీశ్వరి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను నమోదు చేసి, పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. దీనివల్ల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశంలో తమ పరిధిలోని సమస్యలను వివరించడానికి ప్రజాప్రతినిధులు ఎంతో ఆశతో వస్తుంటారని కొంతమంది అధికారులు మధ్యలోనే వెళ్లిపోవడం సరైన పద్ధతి కాదన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో లైన్‌మేన్‌ల కొరత ఉందని, వెంటనే భర్తీ చేయాలని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పదార్థాలు బాగాలేవని, విద్యార్థులు తిన లేక ఆకలితో ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, ఎంపీడీవో ప్రసాదు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.


ఉండ్రాజవరం మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

సమాచారం ఇవ్వాలి..

పెరవలి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయ కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ కార్చర్ల సీతారామప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. వివిధ పథకాల అమలుకు గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించినపుడు ప్రజాప్రతినిధులకు తెలయపరచాలని ఎంపీటీసీ సభ్యులు కోటిపల్లి దేవికారాణి, పల్లేటి రవికుమార్, గండేపల్లి రామకృష్ణ, హరిదాసు సుబ్బారావు, సర్పంచులు కేతా త్రిమూర్తులు, మధుపూర్ణచందు కోరారు. సరైన సమాచారం లేకపోవడంతో పథకాలు అమలు అవుతున్నాయో లేదో తెలియడం లేదన్నారు. ముఖ్యతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి బాటలు వేయాలని అధికారులకు సూచించారు. పథకాల అమలుపై తరచూ సమీక్షలు నిర్వహించాలన్నారు. సౌర విద్యుత్తు వినియోగానికి సంబంధించి కల్పిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించి గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఎంపీడీవో శింగంశెట్టి రమేష్, సీనియర్‌అసిస్టెంటు అరిగెల వేణుగోపాలరావు, కార్యాలయ అటెండురు శ్రీనులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో తహసీల్దార్ అచ్చుతకుమారి, ప్రత్యేకాధికారి సునీల్ వినయ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు వృత్తి విద్య దోహదం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉజ్వల భవితకు వృత్తి విద్య దోహదపడుతుందని ఉండ్రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యాలరావు అన్నారు. వృత్తి విద్య తరగతుల్లో భాగంగా ఆ పాఠశాల విద్యార్థులు గురువారం స్థానిక విద్యుత్తు ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఆయా విభాగాల పని తీరును క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివరించారు. వృత్తి విద్య శిక్షకుడు వి.డి శ్రీనివాసు, ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నందున 4వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాపూజీనగర్, లాయర్స్‌కాలనీ, చిన్న వెంకటేశ్వరస్వామి సమీపాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు.

నిడదవోలు: మండలంలోని తాడిమళ్ల, మేడిపల్లి గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

దేవరపల్లి: దేవరపల్లి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ పట్టణ ఫీడర్ లైన్ మరమ్మతుల నిమ్మితం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

● గోపాలపురం, జగన్నాథపురం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని కరిచర్లగూడెం, కోమటిగుంట, వెదుళ్లగుంట గ్రామాల్లో శుక్రవారం ఉదయం 4 నుంచి 8, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయం 6 గంటల వరకు మాత్రమే వ్యవసాయ విద్యుత్తు సరఫరా ఉంటుందని మిగిలిన సమయాల్లో ఉండదన్నారు.

గోష్పద క్షేత్రంలో వెలిగిన దీపాలు

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు గోష్పద క్షేత్రంలో విద్యుత్తు దీపాలకు పురపాలక అధికారులు మరమ్మతులు చేశారు. కొంతకాలంగా ఇక్కడ దీపాలు వెలగకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై 'ఆధ్యాత్మిక క్షేత్రం.. అంధకారమయం' శీర్షికన ఈనెల 3న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ టి.నాగేంద్రకుమార్ స్పందించారు. క్షేత్ర ప్రవేశ మార్గాల్లో అయిదు విద్యుత్తు దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రధాన రేవులో శివారున రెండు స్తంభాలకున్న హైమాస్టు దీపాలను పరిశీలించి అవసరం మేరకు పునరుద్ధరిస్తామన్నారు.

ఈనాడు కథనానికి స్పందన


క్షేత్రానికి వెళ్లే దారిలో దీపాలను అమర్చే పనులు

సమకూరిన విద్యుత్తు సదుపాయం..

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని టక్కరిబాబాపేట అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్తు సదుపాయం కల్పించారు. ఈ కేంద్రంలో విద్యుత్తు సదుపాయం లేక చిన్నారులు ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిపై ఆగస్టు 23న 'అవస్థల్‌వాడీ' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు విద్యుత్తు సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి ప్రత్యేకంగా మీటరు కూడా ఏర్పాటు చేశారు.

బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు సత్కారం

ఉండ్రాజవరం: బదిలీపై వెళుతున్న ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, ఈవోపీఆర్డీ ప్రసాదు, సూపరింటెండెంట్ శ్రీనివాసు, సీనియర్ అసిస్టెంటు నాగనాథ్, జూనియర్ అసిస్టెంటు మమత తదితరులకు గురువారం ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించి సత్కరించారు.

నిబంధనలు పాటించాలి

చాగల్లు: బాణసంచా తయారీ కేంద్రాల్లో చిన్నారులను నియమించకూడదని ఎస్సై నరేంద్ర తెలిపారు. మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దార్ మెరికమ్మతోపాటు అధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు.

ఆదమరిస్తే అంతే..

పెరవలి మండలంలో బ్యాంకు కాలువ, నిడదవోలు-నరసాపురం కాలువలపై సుమారు పది కాలిబాట వంతెనలున్నాయి. వీటిని నిర్మించి మూడు దశాబ్దాలపైనే అవుతోంది. ప్రస్తుతం రక్షణ గోడలు విరిగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాహనచోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాపవరం, అజ్జరం, వెంకట్రాయపురం, బ్యాంకుకాలువపై కడింపాడు, మల్లేశ్వరం, ఖండవల్లి శివారు లంకమాలపల్లి, ముక్కామల శివారు ముత్యాలవారిపాలెం, ఉమ్మిడివారిపాలెం, ముక్కామల, కాకరపర్రు గ్రామాల్లో ఒక్కదానికి రూ.10 లక్షల చొప్పున వెచ్చించి వీటిని నిర్మించారు. దెబ్బతిని చాలాకాలమవుతున్నా పట్టించుకున్న వారే లేరు. ఇప్పటికైనా వీటికి మరమ్మతులు చేయించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పెరవలి


పెరవలి మండలం కాపవరంలో రక్షణ గోడ పడిపోయి..


పెరవలి ముక్కామలలో..

వ్యూహంతోనే విజన్ సాకారం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర- 2047 విజన్ సాకారం కావాలంటే వ్యూహాత్మకంగా దృష్టిసారించాల్సిన రంగాలను గుర్తించి మరింత బలోపేతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీపీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో స్వర్ణాంధ్ర- 2047 విజన్ సాధనపై గురువారం కార్యశాల నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతోపాటు ఫ్యాక్టరీల యజమానులు, సిబ్బంది హాజరయ్యారు. విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రనాథ్, సర్పంచులు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో ఎండాకు తెగులు నివారణ

తాళ్లపూడి, న్యూస్‌టుడే: యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో ఎండాకు తెగులును నివారించ వచ్చని మండల వ్యవసాయాధికారిణి రుచిత తెలిపారు. అన్నదేవరపేట, గజ్జరం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అధిక నత్రజని వాడకం, పొటాష్ వాడకపోవడం, అధిక వర్షాలు తదితర కారణాల వల్ల ఎండాకు తెగులు సోకుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం, గోనెసంచులు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలాజీ, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.చంద్రశేఖర్ అన్నారు. తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాల్లో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరత్నానికి ప్రముఖుల నివాళి

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు తండ్రి వెంకటరత్నం దశదిన కార్యక్రమం నల్లజర్లలోని ప్రియాంక ఫంక్షన్ హాలులో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, రఘురామకృష్ణంరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీను, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, బూరుగుపల్లి శేషారావు, మంతెన రామరాజుతో పాటు బాపిరాజు అభిమానులు హాజరై వెంకటరత్నానికి నివాళి అర్పించారు. సుమారుగా 10 వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు.


వెంకటరత్నం చిత్రపటం వద్ద మంత్రి రామానాయుడు తదితరులు

ఆలయాల్లో పూజలు

పెరవలి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మండలంలోని తీపర్రులో విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించి, ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

కాకినాడ వెళ్లి పింఛను అందజేత

నిడదవోలు: మండలంలోని అట్లపాడుకు చెందిన గుంటు వెంకటలక్ష్మి అనే ఆమె పేగులో కంతే కారణంగా ఆపరేషన్ నిమిత్తం కాకినాడలో ఆసుపత్రిలో ఉన్నారు. సచివాలయ ఉద్యోగి పృథ్వీరాజ్ ద్విచక్ర వాహనంపై అక్కడకు వెళ్లి గురువారం పింఛను అందించారు.

నల్లజర్ల ఎస్సై బదిలీ

నల్లజర్ల: నల్లజర్ల ఎస్సై శ్రీహరిబాబు అన్నవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయినట్లు సీ.ఐ.శ్రీనివాస్ గురువారం తెలిపారు. తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తూ ఆగస్టు 18న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారన్నారు.

'మతిభ్రమించి మాట్లాడుతున్న రోజా'

నల్లజర్ల: గత ఎన్నికల్లో ఓటమి పాలైన వైకాపా నాయకురాలు ఆర్కే రోజా మతిభ్రమించి మాట్లాడుతున్నారని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివ నాగరాజు విమర్శించారు. అనంతపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిపై రోజా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆయన మండిపడ్డారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

దేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నాయిగూడెంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి 20 గ్రాముల బంగారం అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆలపాటి కుమారి గత నెల 23న భర్తను తీసుకుని డయాలసిస్ వైద్యం నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లారు. గురువారం ఉదయం ఇంటిని శుభ్రం చేయడానికి వచ్చిన పని మనిషి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి యజమాని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వేలముద్రల నిపుణులతో వెళ్లిన పోలీసులు బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి సుమారు 20 గ్రాముల బంగారం, కొంత నగదు అపహరించినట్లు గుర్తించామన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కుమారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.


చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుబ్రహ్మణ్యం

భార్య, పిల్లల అప్పగింత..

పెరవలి: మండలంలోని ముక్కామలకు చెందిన వరచర్ల జానకి రాముడుకు పోలీసులు భార్య, పిల్లలను గురువారం అప్పగించారు. వారు కనిపించలేదని ఆయన గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వారిని అక్కడ నుంచి తీసుకొచ్చి జానకి రాముడుకు అప్పగించారు.

పుంత రోడ్లను పట్టించుకున్న వారేరీ..?

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: వైకాపా అయిదేళ్ల పాలనలో పుంతదారులను పట్టించుకున్న వారు లేక గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. ఇరు వైపులా తుప్పలు పెరిగి ట్రాక్టర్, ఆటో ఇతర వాహనాల రాకపోకలకు అవకాశం లేకపోవడంతో పొలాలకు విత్తనాలు, ఎరువులను తీసుకెళ్లాలన్నా.. అక్కడ నుంచి పంట ఉత్పత్తులను బయట మార్కెట్‌కు తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పశుపోషణ ఎక్కువగా ఉండడంతో వేకువజామున, సాయంత్రం వేళల్లో మకాముల వద్దకు వెళ్లిరావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పోషకులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 18 గ్రామాల్లో పుంతరోడ్లను ఆనుకునే శ్మశాన వాటికలు ఉండడంతో మృతదేహాలను అంతిమ సంస్కారానికి తరలించడానికి యాతన పడుతున్నామని ప్రజలు అంటున్నారు.

● నిడదవోలు నియోజకవర్గం పరిధిలోని ఉండ్రాజవరం మండలంలో 13, పెరవలిలో 11, నిడదవోలులో 14 కలిపి సుమారు 160 కిలోమీటర్ల మేర పుంత రోడ్లు విస్తరించి ఉన్నాయి. ఇవన్నీ గుంతలుపడి అధ్వానంగా తయారడంతో కొబ్బరి, కంద, కూరగాయలు తదితర పంట ఉత్పత్తులు తరలిస్తున్న మినీవ్యాన్‌లు, ఇతర వాహనాలు దిగబడిపోతుండడంతో రైతులు నరకయాతన పడుతున్నారు. ఇరువైపులా తుప్పలు పెరిగి చిట్టడవిలా మారడంతో విషపురుగుల బెడద అధికమైందని అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు. తీపర్రు నుంచి వెలగదుర్రు వెళ్లే పుంత రోడ్డు గతంలో సగం నిర్మించి వదిలేశారు. ఈ ప్రాంతంలో పూర్తిగా ఉద్యాన సాగు చేస్తున్నారు. నిత్యం వాహనాల్లో పంట ఉత్పత్తులను తణుకు, రావులపాలెం తదితర మార్కెట్లకు తరలిస్తుంటారు. ఇతర రాష్ట్రాలకు అరటి గెలలు లారీల్లో ఎగుమతి చేస్తుంటారు. ఇరుగ్గా ఉన్న ఈ దారుల మీదుగా లోడు లారీలు ప్రయాణించటానికి అనుకూలంగా లేక కిలోమీటరు దూరంలో ఉన్న ప్రధాన రహదారిలో లారీలను నిలిపివేస్తున్నారు. అక్కడ వరకు కూలీల ద్వారా గెలలు మోయిస్తున్నారు. దీంతో రైతుకు, వ్యాపారులకు అదనంగా లారీ గెలలకు సుమారు రూ 8 వేల వరకు వెచ్చిస్తున్నారు. ఈ ఖర్చుల్లో కొంత భాగం రైతులు నష్టపోతున్నారు. ఎంతో ప్రాధాన్యమున్న పుంతరోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వీటి దుస్థితిని ఏఈ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి అభిద్ధికి చర్యలు చేపడతామన్నారు.


రాళ్లు తేలిన వెలగదుర్రు-తాడిపర్రు పుంత రోడ్డు


ఉండ్రాజవరంలో గుంతలమయంగా..